సా..గుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

జిల్లాలో ఈనెల 2వరకు పూర్తయిన సర్వే వివరాలు

మండలం	దరఖాస్తులు	సర్వే చేసినవి
బెల్లంపల్లి	8,277	7,846
భీమారం	4,671	3,737
భీమిని	4,876	4,655
చెన్నూరు	10,158	7,724
దండేపల్లి	13,816	11,524
హాజీపూర్	8,214	6,852
జైపూర్	9,958	7,538
జన్నారం	15,560	12,871
కన్నెపల్లి	6,271	4,925
కాసిపేట	8,829	7,107
కోటపల్లి	10,912	9,863
లక్సెట్టిపేట	7,926	6,171
మందమర్రి	4,057	3,037
నెన్నెల	7,549	7,085
తాండూర్	9,443	7,683
వేమనపల్లి	5,937	5,034
మున్సిపాలిటీల్లో		
బెల్లంపల్లి	12,280	7,728
చెన్నూరు	5,648	4,491
క్యాతన్‌పల్లి	6,258	5,610
లక్సెట్టిపేట	4,918	4,556
మంచిర్యాల	18,163	13,527
మందమర్రి	10,011	7,946
నస్పూరు	12,207	8,215
మొత్తం	2,05,939	1,65,725

- జిల్లాలో 2.05లక్షల దరఖాస్తులు
- సర్వే పూర్తయినవి 1.65లక్షలు
- 1.58లక్షల దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదు
- 80శాతమే పూర్తి


మంచిర్యాలలో దరఖాస్తుదారు ఇంటి వద్ద సర్వే చేస్తున్న సిబ్బంది

ఉండేది మంచిర్యాలలో.. సర్వే లక్సెట్టిపేటలో



జంపాల మహేశ్ ఇందిరమ్మ ఇంటి కోసం ప్రజాపాలనలో తన భార్య మధుశాలిని పేరిట దరఖాస్తు చేశాడు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉండే వీరికి లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం నుంచి దరఖాస్తు పరిశీలన ఉందని ఫోన్ వచ్చింది. నివాసం ఉండేది మంచిర్యాలలో, ఇక్కడే దరఖాస్తు చేసుకుంటే లక్సెట్టిపేట నుంచి ఫోన్ రావడంతో ఆందోళన చెందుతున్నాడు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఆన్‌లైన్‌లో నమోదు సమయంలో తప్పులు దొర్లడంతో దరఖాస్తుదారులు, సర్వే సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది.

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే నెమ్మదిగా సా..గుతోంది. గత నెల 31లోపే వంద శాతం సర్వే పూర్తి చేయాల్సి ఉన్నా సాంకేతిక సమస్యలు, దరఖాస్తుదారుల వివరాలు సక్రమంగా లేకపోవడం, ఒక ఊరిలోని దరఖాస్తును మరో ఊరికి సర్వే కోసం ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడం వంటి వివిధ కారణాలు, దరఖాస్తుదారులను స్వయంగా ఫొటో తీయాల్సి రావడం, వారు అందుబాటులో లేకపోవడం వంటి అంశాల కారణంగా జాప్యం జరుగుతోంది. ఈ నెల 6వ తేదీలోపు పూర్తి చేయాలనే మౌఖిక ఆదేశాలు ఉన్నా.. ఒకటో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 2,05,939 దరఖాస్తులకు గాను 1,65,725 దరఖాస్తు సర్వే చేశారు. వీటిలో 7,553 దరఖాస్తుల్లో సరైన వివరాలు లేక ఆన్‌లైన్‌లో నమోదు కాకపోగా, 1,58,172 దరఖాస్తులు ఇందిరమ్మ యాప్‌లో నమోదయ్యాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 80శాతం సర్వే పూర్తి చేశారు. వంద శాతం సర్వేకు మరిన్ని రోజులు సమయం పట్టనుండగా.. దీని ప్రభావం లబ్ధిదారుల ఎంపికపై పడనుంది.

సిబ్బందికి ఇబ్బందులు

దరఖాస్తుదారుల వివరాలను సర్వే సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా నమోదు చేసుకోవాలి. వారు అందుబాటులో లేకపోవడం, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఇతరత్రా పనుల నిమిత్తం వెళ్లిన వారు సర్వేకు రాకపోవడంతో ఆన్‌లైన్ నమోదు ఆలస్యమవుతోంది. లబ్ధిదారు పేరు, ఆధార్ ఐడీ, వార్షికాదాయం, స్వంత స్థలం ఉందా, గతంలో ఏదైనా ఇల్లు మంజూరైందా వంటి 35రకాల ప్రశ్నలు అడిగి తెలుసుకుని నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఉంటేనే యాప్‌లో ఎంట్రీతోపాటు ఫొటోను అద్దెకు ఉంటున్న ఇల్లు, స్థలం వద్ద తీసుకోవాల్సి ఉంటుంది. వాటిని యాప్‌లోనే నమోదు చేయాల్సి రావడం, సాంకేతిక సమస్య, ఇంటర్నెట్ సరిగా రాకపోవడం వంటి కారణాలు సర్వేకు ఆటంకంగా మారుతున్నాయి. దీంతో సమయానికి సర్వే చేయలేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొందరు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఉన్నారు. సర్వే కోసం ఎక్కడికో వెళ్లి పనులు చేసుకుంటున్న వారు రాలేకపోవడం కూడా దరఖాస్తుల పరిశీలనకు ఆటంకంగా మారుతోంది.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. మంచిర్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదినారాయణను గురువారం పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమక్షంలో ఆదినారాయణను నగ్నంగా చేసి విచక్షణరహితంగా మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటన జరిగిన కూడా పోలీసులు నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పెంచిపోషించిన రౌడీ షీటర్లు, భూకబ్జాదారులను ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాపాడుతున్నారని తెలిపారు. అలాంటి వారిని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బహిష్కరించాలని డిమాండ్ చేశారు.


ఆదినారాయణను పరామర్శిస్తున్న ఏమాజీ

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మంచిర్యాలఅర్బన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్, అధ్యాపకదర్శిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కోశాధికారి కిరణ్, జిల్లా కార్యదర్శులు దేవదాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

- పీఆర్‌టీయూ టీఎస్ డైరీ, క్యాలెండర్‌ను డీఈవో యాదయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా ప్రధానకార్యదర్శి రాసపల్లి రవి, గౌరవ అధ్యక్షుడు జనార్దన్, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు ఎంవీఎస్ ప్రసాద్, తిరుపతి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో యాదయ్య

'ప్రతిపక్షాలవి అసత్యప్రచారం'

జైపూర్: చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని, ఇది చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు సోషల్ మీడియాలో అసత్యప్రచారాలు చేస్తున్నారని డీసీసీ జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్ పేర్కొన్నారు. జైపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇసుక అక్రమ రవాణా, ఇతర జీరో దందాలను నిలిపివేసి ప్రభుత్వ నిబంధనల మేరకే అనుమతితో క్వారీలు నిర్వహిస్తోందన్నారు. అయినా కొందరు ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇవి మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాపిరెడ్డి, లింగారెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్

మైనింగ్ క్వారీ గేటు తెరుస్తాం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ అటవీప్రాంతంలో పెద్దపులి సంచారంతో ఓరియంట్ సిమెంట్ కంపెనీ మైనింగ్ నిర్వహిస్తున్న క్వారీ గేటును రెండు రోజుల క్రితం మూసివేశారు. ఈ విషయమై దేవాపూర్ అటవీశాఖ కార్యాలయంలో అధికారులు, ఓరియంట్ అధికారులతో గురువారం ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఆ ప్రాంతం నుంచే ఆదివాసీల రాకపోకలు అధికంగా ఉంటాయని తెలిపారు. గేటు మూసివేతతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ఈ క్రమంలో ఆందోళనలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. పులి సంచారంతో తాత్కాలికంగా గేటు మూసివేశామని, మళ్లీ తెరుస్తామని అధికారులు తెలపడంతో వారు శాంతించారు. మాజీ సర్పంచులు ఆడ జంగు, పెంద్రం రాజు, మడావి అనంతరావు, నాయకులు కొమ్ముల బాపు, కన్నక రాజు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

'లక్ష డప్పులు, వేయిగొంతుల'కు సంపూర్ణ మద్దతు


మాట్లాడుతున్న ఓయూ జేఏసీ నేత దరువు అంజన్న

మందమర్రిరూరల్: హైదరాబాద్‌లో వచ్చేనెల 3న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఓయూ జేఏసీ నేత, ప్రజాకవి దరువు అంజన్న పేర్కొన్నారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణ గత 30 ఏళ్లుగా చేసిన పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. ఇది మింగుడుపడని మాల సామాజికవర్గానికి చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని 33 జిల్లాల కవులు, కళాకారులు వర్గీకరణకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్, ప్రజాసంఘాల నాయకులు సత్యంరెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

5న వైద్యశిబిరం

జన్నారం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్ హన్స్ స్కూల్‌లో ఈనెల 5న రాఘవేంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మెడిలైఫ్, రాఘవేంద్ర ట్రస్టు సంయుక్తంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ఇతర మండలాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి, దేవునిగూడ గ్రామాల మహేంద్ర సంఘం సంయుక్త నూతన కార్యవర్గాన్ని గురువారం గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒడిపెల్లి సురేశ్, ప్రధాన కార్యదర్శిగా నిలం నర్సింగం, కోశాధికారిగా కొడిజుట్టు రాజన్న, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కాసిపేట: బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌ను గురువారం క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అరుణాచల ఈశ్వరుడి ప్రసాదం ఆయనకు అందించారు. మంత్రి పదవి రావాలని పూజలు చేసినట్లు రత్నం ప్రదీప్ తెలిపారు. నాయకులు మైదం రమేశ్, తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందిస్తున్న రత్నం ప్రదీప్

క్లుప్తంగా

టీఎన్జీఓ సభ్యత్వ నమోదు


తహసీల్దార్ కార్యాలయంలో సభ్యత్వం అందజేస్తున్న టీఎన్జీఓ అధ్యక్షుడు శ్రీహరి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్, మండల వ్యవసాయ శాఖ కార్యాలయాలు, గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో గురువారం టీఎన్జీఓ సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించగా మండలంలో ఉన్న 40 మంది నాన్‌గెజిటెడ్ అధికారులకు సభ్యత్వం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఉపాధ్యక్షుడు సందీప్, కార్యవర్గ సభ్యుడు శర్మ పాల్గొన్నారు.

కమాండెంట్‌ను కలిసిన టీఎన్జీఓ నాయకులు

బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములును టీఎన్జీఓ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడియారం శ్రీహరి, భూముల రామ్మోహన్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలయ అభివృద్ధిపై సమీక్ష

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాలలోని పురాతన రామలింగేశ్వర ఆలయ విస్తరణ అభివృద్ధిపై గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమీక్షించి పలు తీర్మానాలు చేశారు. ఆలయ అభివృద్ధికి స్థలాలు ఇచ్చిన భూ దాతలకు సన్మానం, ఈనెల 10న వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారా దర్శనం ప్రారంభం, ఆలయ విస్తరణ పనులు పూర్తయ్యే వరకు కమిటీ కొనసాగింపు, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు ధన్యవాద తీర్మానాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్, కిషన్, నరేశ్, వెంకట్రామయ్య, పోచయ్య, శంకరయ్య, రాజలింగు, సుధీర్, భీమయ్య, తిరుపతి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ

వేమనపల్లి: మండలంలోని సుంపుటం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ గురువారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు గ్రామస్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. నాయకులు ఒడిళ్ల రాజన్న, గాలి మధు, పూర్ణచంద్రారెడ్డి, మోర్ల రమేశ్, ఆలం లక్ష్మణ్, కుబిడె కిష్టయ్య, దండెర మహేశ్, బానేశ్, తిరుపతి, శేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న సభ్యులు

నెన్నెల: మండలంలోని కోణంపేటలో గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నెన్నెల ఎస్సై ప్రసాద్‌తో కలిసి 70 కుటుంబాలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి తలసేమియా వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో ఆదుకుంటున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలను ఎస్సై ప్రసాద్ కొనియాడారు. జనరల్ సెక్రెటరీ మహేందర్, సురభి, శరత్‌కుమార్, అభినవ సంతోష్, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, నాయకులు బాపురెడ్డి పాల్గొన్నారు.

'ఫిర్యాదులు చేసినా చర్యల్లేవ్'

దండేపల్లి: మండలంలో రేషన్ బియ్యం అక్రమ దందాపై అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దండేపల్లికి చెందిన గుండ రవీందర్ ఆరోపించాడు. స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో గురువారం ఆయన స్థానికులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేషన్‌బియ్యం అక్రమదందాపై అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు సమాచార హక్కు చట్టం ద్వారా ఫిర్యాదులు చేస్తే కొందరు వ్యాపారులు తనను బెదిరింపులకు గురిచేస్తున్నారని వాపోయాడు. రేషన్‌బియ్యం అక్రమ దందాపై ఉన్నతాధికారులు దృష్టిసారించి అరికట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హమాలీల సమ్మె


బెల్లంపల్లి: సమ్మె చేస్తున్న హమాలీలు


శ్రీరాంపూర్: నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం బెల్లంపల్లిలో సివిల్ సప్లయ్ హమాలీలు సమ్మె చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం ఎదుట దీక్షలో కూర్చున్నారు. అంతకుముందు విధులు బహిష్కరించారు. తెలంగాణ సివిల్ సప్లయ్ హమాలీ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 187 సివిల్ సప్లయ్ గోదాంల్లో 3,600 మంది హమాలీలు పని చేస్తున్నారని అన్నారు. వీరికి క్వింటాల్‌కు రూ.29 హమాలీ చెల్లించాలని, రూ.10 లక్షలు బీమా చేయించి, ఏరియర్స్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

శ్రీరాంపూర్: సివిల్ సప్లయ్ హమాలీలు సమ్మె కొనసాగిస్తున్నారు. రెండో రోజు గురువారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధి తీగల్‌పహాడ్‌లోని సివిల్ సప్లయిస్ గోదాం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ పెంచిన హమాలీ రేట్ల జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి హమాలీ రేట్లు పెంచాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన నిత్యవసర ధరలతో హమాలీలు చాలీచాలని రేట్లతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సంఘం నాయకులు సంపత్, తిరుపతి, సాగర్, రాజు, సంతోశ్, పద్మ పాల్గొన్నారు.

బర్ధన్ ఆశయాలు కొనసాగిస్తాం

బెల్లంపల్లి: కమ్యూనిస్టు దిగ్గజం, అమరుడు ఏ.బీ బర్ధన్ ఆశయాలు కొనసాగిస్తామని సీపీఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమొగిలి, జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య అన్నారు. పట్టణ సీపీఐ కార్యాలయంలో బర్ధన్ 9వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కామ్రేడ్స్ పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్ధన్ కార్మిక, ప్రజా ఉద్యమాల్లో పనిచేసి జైలు జీవితం గడిపారని అన్నారు. కార్మికుల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేశారని గుర్తుచేశారు. అంచెలంచెలుగా పార్టీలో ఎదిగిన ఆయన నాలుగుసార్లు జాతీయ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి రాజేశ్, బీకేఎంయూ జిల్లా సమితి సభ్యుడు జీసీ మాణిక్యం, నాయకులు రత్నం రాజం, రాంచందర్, స్వామిదాస్, రాజమల్లు, రాధాకృష్ణ పాల్గొన్నారు.


విప్లవ జోహార్లు అర్పిస్తున్న కామ్రేడ్స్

బొగ్గుబాయి వార్తలు

కార్మికులకు ప్రమోషన్ పత్రాలు అందజేత

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పనిచేస్తున్న పలువురు కార్మికులకు ప్రమోషన్ పత్రాలు అందుకున్నారు. గురువారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హత ఉన్న కార్మికులకు పత్రాలను గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో వివిధ కేటగిరీలకు సంబంధించిన 36 మంది కార్మికులకు ప్రమోషన్ పత్రాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓఏఐ ఉపాధ్యక్షుడు డి.నాగవర్ధన్, సీనియర్ పీవో ఆర్.సత్యనారాయణ, ఎంటీ (పర్సనల్) ఈ.రవికుమార్, ఏఐటీయూసీ గని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ప్రమోషన్ పత్రాలతో కార్మికులు

ఆర్డర్లు అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఉద్యోగులకు సంబంధించి నర్వీర్ లింక్డ్ ప్రమోషన్ (సీఎల్‌పీ) ఆర్డర్లను జీఎం దేవేందర్ తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గతేడాది కన్నా రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వర్తించాలని ఉద్యోగులకు సూచించారు. అంతకుముందు న్యూఇయర్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అధికారులు, ఉద్యోగులు, గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నాయకులు ఉన్నారు.


అధికారులు, సిబ్బందితో జీఎం దేవేందర్

ఉత్పాదకత పెంచాలి

శ్రీరాంపూర్: ఉత్పాదకతను పెంచాలని ఆర్కే 5, ఆర్కే 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ తెలిపారు. ఆర్కే 5 గనిపై గత డిసెంబర్‌లో అధిక ఉత్పత్తికి కృషి చేసిన ఉద్యోగులకు గురువారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు తరచూ గైర్హాజరవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వారు మారి డ్యూటీలకు రావాలన్నారు. గని మేనేజర్ సుధీర్‌కుమర్ మాట్లాడుతూ డిసెంబర్‌లో బీ రిలే ఉద్యోగులు అధిక బొగ్గు ఉత్పత్తిని సాధించారని, దీనికి కారణమైన ఎస్‌డీఎల్ ఆపరేటర్లు, కోల్‌కట్టర్లు, సపోర్టుమెన్, ట్రామర్, హెచ్‌ఓపీలను అభినందించారు. మిగతా ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రాందాస్, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ శివయ్య పాల్గొన్నారు.


బహుమతులు చేస్తున్న అధికారులు

విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా విద్యార్థులకు ఉచిత నోట్‌పుస్తకాలు అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వనజరెడ్డి, సుధాకర్, ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున విద్యార్థుల కోసం నోట్ బుక్స్ అందజేశారు.

ఎంఈవోను నియమించాలి

భీమారం: మండలంలో విద్యావ్యవస్థ మరింత మెరుగుపడేందుకు రెగ్యులర్ ఎంఈవోని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలం ఏర్పడి దాదాపు 9 ఏళ్లు పూర్తి కావస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంఈవోలతో తప్ప రెగ్యులర్‌ను నియమించలేదని పేర్కొంటున్నారు. మండలంలోని 11 పంచాయతీల్లోని పాఠశాలల పర్యవేక్షణ కోసం రెగ్యులర్ ఎంఈవోని నియమించాలని జిల్లా అధికారులను కోరుతున్నారు.